నీటి గోస తీరేదారేది?

- బ్రాహ్మణపల్లి, నత్నాయిపల్లిలో తీవ్ర నీటి ఎద్దడి
- మోటర్లు కాలిపోయినా పట్టించుకోని అధికారులు
- మిషన్ భగీరథ నీరు రాక అవస్థలు

నర్సాపూర్, డిసెంబర్ 7: ఎండాకాలం రాకముందే నీటి కష్టాలు మొదలయ్యాయి. వేసవిలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రతరమైంది. గతంలో క్రమం తప్పకుండా మిషన్ భగీరథ నీరు వచ్చేవని నేడు పరిస్థితి భిన్నంగా ఉన్నదని వాపోతున్నారు. నీటి కోసం మహిళలు రోడ్లపైకి వస్తున్నారు. సింగిల్ ఫేజ్ మోటర్లు, బోర్ల కాడికి పరుగులు తీస్తున్నారు. ట్యాంకు మోటర్లు పాడైతే మరమ్మతులు చేయించడానికి అధికారులు శ్రద్ధ చూపడం లేదు. మోటర్లు బాగు చేయించండని పంచాయతీ కార్యదర్శులను అడిగితే డబ్బుల్లేవని చెబుతున్నారన్నారు.

చలికాలంలోనూ నీటి గోష

మండలంలోని నత్నాయిపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో తరుచూ నీటి తిప్పలు తప్పడం లేదు. నత్నాయిపల్లి, బ్రాహ్మణపల్లిలో వాటర్ ట్యాంకు బోరు చెడిపోవడం, మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో నాలుగు రోజుల నుంచి గ్రామస్తులు విలవిలాడుతున్నారు. సింగిల్ ఫేజ్ మోటర్ నుంచి నీళ్లు తీసుకెళ్లడానికి గ్రామస్తులు బారులు తీరుతున్నారు. మంచినీటితో పాటు ఇతర అవసరాలకు ఇదే నీరు అవసరం కావడంతో మహిళలు పోటీ పడి మరీ నీళ్లు తీసుకెళ్లాల్సి వస్తున్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

నత్నాయిపల్లిలో నీటి కోసం ఎదురుచూస్తున్నమహిళలు

బ్రాహ్మణపల్లిలో నీటి కోసం బారులు తీరిన గ్రామస్తులు

బ్రాహ్మణపల్లిలో ట్రాక్టర్‌లో నీటిని తీసుకొస్తున్న గ్రామస్తులు

బోరు నుంచి వాహనంలో నీటిని తీసుకొచ్చిన గ్రామస్తుడు

ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరు

- సర్వేను పారదర్శకంగా నిర్వహించాలి
- విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి
- కలెక్టర్ రాహుల్‌రాజ్

పెద్దశంకరంపేట, డిసెంబర్ 7: ప్రతి నియోజక వర్గానికి 3500 ఇండ్లు మంజూరయ్యాయని కలెక్టర్ తెలిపారు. చీలపల్లి గ్రామంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి ఇందిరమ్మ ఇండ్ల పథకం ఆప్‌ను ప్రారంభించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను ప్రత్యేక మొబైల్ ఆప్ ద్వారా నమోదు చేస్తున్న తీరును పరిశీలించారు. క్షేత్రస్థాయిలో సర్వే కోసం ఎంపిక చేసిన కార్యదర్శులు ఇతర సిబ్బంది యాప్ ద్వారా సర్వే చేసే విధానంపై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా ఇందిరమ్మ ఇండ్ల సర్వే జరుపాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే పారదర్శకంగా చేపట్టాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం ముందుకు పోతున్నదన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శనివారం పెద్దశంకరంపేటలోని కేజీబీవీతో పాటు మండలంలోని చీలపల్లి ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. అనంతరం చీలపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం ఎలా పెడుతున్నారు, చదువు ఎలా చెప్పున్నారని విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీలో ఫ్లోరింగ్, మరుగుదొడ్ల సమస్య ఉన్నదని, సోలార్ ప్లాంట్ చెడిపోయిందని, సెప్టిక్ ట్యాంకు పూర్తిగా నిండిపోయి నీరు బయటకు వస్తున్నదని ప్రిన్సిపాల్ విజయ కలెక్టర్‌కు తెలిపారు. గతంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. కార్యక్రమంలో డీపీవో యాదయ్య, తహసీల్దార్ గ్రేసీబాయి, ఎంపీడీవో రఫీకున్నీసా, నాయకులు రాయిని మధు, నారాగౌడ్, ఆర్ఎన్ సంతోష్ కుమార్, సుభాష్‌గౌడ్, పెరుమాల్‌గౌడ్, సంగమేశ్వర్, రజన్ గౌడ్, తదితరులున్నారు.

ప్రభుత్వ పథకాలను పకడ్బందీగా అమలు

మెదక్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): ప్రజల సంక్షేమం కోసం చేపడుతున్న పథకాలు క్షేత్రస్థాయిలో పగడ్బందీగా అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో సాంస్కృతిక కళా ప్రదర్శనలు, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్ విన్యాసాలు, నార్కోటిక్ మత్తు పదార్థాల నిర్మూలన, రవాణా, అగ్నిమాపక, జిల్లా గ్రామీణ అభివృద్ధి, మెప్మా స్టాల్స్ ఏర్పాటు చేశారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్ బృందాల విన్యాసాల ఆకట్టుకున్నాయి.

పెద్దశంకరంపేట: చీలపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

పెద్దశంకరంపేట: చీలపల్లి గ్రామంలో పర్యటిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి

- ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి
- మెదక్‌లో ట్రాఫిక్ విభాగం ప్రారంభం
- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తామని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం మెదక్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ట్రాఫిక్ విభాగాన్ని ప్రారంభించారు. అనంతరం పట్టణ సీఐ నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా కేంద్రం ఏర్పడిన తర్వాత మెదక్‌లో ట్రాఫిక్ పెరిగిందన్నారు. వెల్‌కం బోర్డు నుంచి పాత బస్టాండ్, రాందాస్ చౌరస్తా మీదుగా బస్టాండ్ వరకు ట్రాఫిక్ ఉంటుందన్నారు. ఎస్ఐ, 10 మంది సిబ్బంది ఉంటారన్నారు. పట్టణంలో సీసీ కెమెరాల నిఘా పెంచుతామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్‌రెడ్డి, మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, సైబర్ క్రైం డీఎస్పీ సుభాష్ చంద్రబోస్, ఏఆర్ డీఎస్పీ, మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ మురళీ, పట్టణ ఎస్ఐ అమర్, ట్రాఫిక్ విభాగం ఎస్ఐ భవానీశంకర్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఏడుపాయల్లో ప్రమాదాపై జాగ్రత్తలు వహించాలి: ఎస్పీ

పాపన్నపేట, డిసెంబర్ 7: ప్రాణం పోతే తిరిగి రాదని ఏడుపాయల్లో అవుట్ పోస్టును మళ్లీ పునరుద్ధరిస్తున్నట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ప్రఖ్యాతిగాంచిన ఏడుపాయల వనదుర్గామాత సన్నిధిలో శనివారం అవుట్ పోస్టును పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎస్పీగా బాధ్యతలు చేపట్టినప్పుడు ఏడుపాయల్లో ప్రతి నెలా ఇద్దరు, ముగ్గురు నదిలో పడి మృతి చెందిన ఘటనలు తన దృష్టికి వచ్చాయని, దీంతో తాను కలత చెందానన్నారు. అప్పటి నుంచి తమ దృష్టంతా నీటి ప్రమాదాల మీద కేంద్రీకరించి, కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామన్నారు. అప్పటి నుంచి ప్రమాదాల సంఖ్య 90 శాతం నివారించగలిగామన్నారు. అందుకే ఏడుపాయల్లో అవుట్ పోస్ట్ పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. ఏదైన ఘటన జరిగితే పాపన్నపేట నుంచి ఏడుపాయలకు పోలీసులు 20 కిలోమీటర్లు రావాల్సి ఉంటుందన్నారు. ఏడుపాయల్లో ప్రమాదాల నివారణకు బోటింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిందిగా గతంలో ఆలయ ఈవోకు చెప్పినా పట్టించుకోలేదన్నారు. అవుట్ పోస్ట్‌లో ఏఎస్సై, హెడ్ కానిస్టేబుల్‌తో పాటు నలుగురు పోలీసులు ఉంటారన్నారు. మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్‌రెడ్డి, సీఐ రాజశేఖర్‌రెడ్డి, పాపన్నపేట, కొల్చారం ఎస్సైలు శ్రీనివాస్‌గౌడ్, మమ్మద్ గౌస్, ఈవో చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు.

పాపన్నపేట: ఏడుపాయల్లో అవుట్ పోస్టును ప్రారంభిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

బీఆర్ఎస్ నాయకుడి అంత్యక్రియలకు ఎమ్మెల్యే హాజరు

శివ్వంపేట, డిసెంబర్ 7:దొంతి గ్రామంలో బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు చాకలి సత్యనారాయణ మృతిచెందాడు. ఆయన అంత్యక్రియలకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హాజరై నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట పార్టీ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, మాజీ ఎంపీటీసీ కొడాస్ లక్ష్మీకుమార్, బీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరు వీరేశం, యాదాగౌడ్, బుద్దుల భిక్షపతి తదితరులు ఉన్నారు.

డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్ల జాబితా విడుదల

చిన్నశంకరంపేట, డిసెంబర్ 7: చిన్నశంకరంపేట ఎంపీడీవో కార్యాలయం లో శనివారం ఎంపీడీవో దామోదర్ గ్రామపంచాయతీ ఎన్నికల డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్ల జాబితాను విడుదల చే శారు. ఆ జాబితాను ఎంపీడీవో కార్యాలయంలో నోటీస్‌బోర్డుపై ఉంచారు.

అయ్యప్పస్వాములకు విరాళం అందజేత

శివ్వంపేట, డిసెంబర్ 7: శివ్వంపేటలోని రాములో ఆలయంలో ఉంటున్న అయ్యప్ప స్వాములకు మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్ గుప్తా రూ.75వేల నగదును విరాళంగా అందజేశారు. అయ్యప్ప స్వాములకు అన్ని విధాలుగా తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని మాజీ జడ్పీటీసీ తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ పద్మవెంకటేశ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు ముద్దగల్ల లక్ష్మీ నర్సయ్య, వంజరి కొండల్, పంబాల సంతోష్, ముద్దగల్ల రాజు, పత్రాల త్రినేశ్, అయ్యప్పస్వామి మాలధారులు ఉన్నారు.

బాల్య వివాహాలు చేస్తే చర్యలు

తల్లిదండ్రుల నుంచి ఒప్పంద పత్రం తీసుకుంటున్న అధికారులు

చిలిపిచెడ్, డిసెంబర్ 7: బాల్యవివాహాలు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత, ఎస్సై నర్సింహులు అన్నారు. శనివారం మండలంలోని సోమక్కపేట గ్రామ పంచాయతీ పరిధిలోని గంగిఎద్దుల గూడాలో బాలిక వివాహం చేయడానికి సిద్ధమయ్యారన్న సమాచారం మేరకు ఐసీడీఎస్, పోలీస్ అధికారులు గ్రామానికి వెళ్లి బాల్యవివాహం చేస్తున్న తల్లి దండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ, ఐసీడీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

చిన్నశంకరంపేట, డిసెంబర్ 7: రేషన్ దుకాణాల్లో డీలర్లు అవతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సివిల్ సప్లై ఎండోమెంట్ డీఎస్పీ వెంకటేశం హెచ్చరించారు. శనివారం ఆయన చిన్నశంకరంపేటలోని రేషన్ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ దుకాణంలోని రికార్డులను పరిశీలించారు. డీఎస్పీ మాట్లాడుతూ డీలర్ ప్రజలకు రేషన్ బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. ఆయనతో సివిల్ సప్లై ఎండోమెంట్ సీఐ పండరి, ఎస్సై సాంబశివరావు, సివిల్ సప్లై తహసీల్దార్ ప్రభాకర్ ఉన్నారు.

రేషన్ దుకాణాన్ని పరిశీలిస్తున్న సివిల్ సప్లై ఎండోమెంట్ డీఎస్పీ వెంకటేశం

ప్రపంచ దివ్యాంగుల దినోత్సం

చిలిపిచెడ్, డిసెంబర్ 7: దివ్యాంగులు విద్య, ఉద్యోగాల్లో ముందుండాలని ఎంఈవో విఠల్ సూచించారు. శనివారం చిలిపిచెడ్ ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు.

అంబులెన్స్ మంజూరుపై హర్షం

వెల్దుర్తి, డిసెంబర్ 7: మాసాయిపేట మండలానికి ప్రభుత్వం అంబులెన్స్ మంజూరు చేయడంపై మాజీ ఎంపీటీసీలు కృష్ణారెడ్డి, సిద్దిరాంలుగౌడ్, సొసైటీ డైరెక్టర్ నర్సింలు హర్షం వ్యక్తం చేశారు.

సీజ్ చేసిన ఇసుక డంప్‌లు వేలం

చిలిపిచెడ్, డిసెంబర్ 7: బండపోతుగల్ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌లను తహసీల్దార్ ముసాద్దీక్, ఎస్సై నర్సింహులు సమక్షంలో శనివారం వేలం వేశారు. వేలంలో 16 మంది పాల్గొన్నారు. అదే గ్రామానికి చెందిన మన్నె వెంకటేశం రూ.21వేలు, మంతురి మల్లేశం రూ.41 వేలు, గొల్ల మల్లేశం రూ.26వేలు, కొట్టాల కిష్టయ్య రూ.9వేలు, చిట్కుల్ గ్రామానికి చెందిన గొలుసుగారి సత్యం రూ.53వేలు, కొట్టాల రవి రూ.25వేలు మొత్తం రూ.లక్షా 74వేలకు పాడినట్లు తహసీల్దార్ తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

శివ్వంపేట, డిసెంబర్ 7: చండి గ్రామానికి చెందిన నిజ్జని శ్రీకాంత్ ఇటీవల మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయాన్ని పులిమామిడి నవీన్‌గుప్తా శనివారం అందజేశారు.

నేడు రవీంద్రభారతిలో తెరసం పదేళ్ల పండుగ

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

మెదక్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): జిల్లా అధ్యక్షురాలు ముత్తిగారి కవిత ఆధ్వర్యంలో తెరసం పదేళ్ల పండుగ కరపత్రికను శనివారం ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఆదివారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు, దానికి కవులందరూ పెద్ద ఎత్తున పాల్గొని సభను విజయవంతం చేయవలసిందిగా ఆమె కోరారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి: తపస్

తూప్రాన్, డిసెంబర్ 7: ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని తపస్ రాష్ట్ర కార్యదర్శి పబ్బతి శ్రీనాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మెదక్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని తూప్రాన్‌లోని నలంద డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్‌సురేశ్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, చల్లా లక్ష్మణ్, రాష్ట్ర కార్యదర్శి దుబాషి భాస్కర్, తపస్ మహిళా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు స్వరూపారాణి, సుజాత, తూప్రాన్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భాను ప్రసాద్ పాల్గొన్నారు.

నీటిగుంతలో పడి రైతు మృతి

మోహన్ మృతదేహం

చిన్నశంకరంపేట, డిసెంబర్ 7: నీటి గుంతలో పడి రైతు మృతి చెందిన ఘటన మండలంలోని గవ్వలపల్లి గెరిల్లా తండాలో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గవ్వలపల్లి గెరిల్లా తండాకు చెందిన నునావత్ మోహన్(45) ఎస్.కొండాపూర్ గ్రామశివారులో తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి, పొలం వద్ద గల నీటి నిల్వ గుంతలో జారిపడి నీట మునిగి ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు చిన్నశంకరంపేట ఎస్సై నారాయణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామస్థాయి క్రీడలు ప్రారంభం

వెల్దుర్తి, డిసెంబర్ 7: వెల్దుర్తిలో గ్రామస్థాయి క్రీడాపోటీలను ఎంఈవో యాదగిరి శనివారం ప్రారంభించారు. జడ్పీహెచ్ఎస్‌లో మాజీ సర్పంచ్ అముద భాగ్యమ్మ, మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, హెచ్ఎం సాంబయ్యలతో కలిసి కబడ్డీ పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఈవో బలరాంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★Looking for 1-4 yrs. Sales and Marketing Experience profiles in Paints Industry. Working across AP & TS. VG Paintings Industry. Cantact: 9494998833.

NT-326903_All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గుండెపోటుతో విలేకరి మాతృమూర్తి మృతి

లక్ష్మి మృతదేహానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి

నిజాంపేట, డిసెంబర్ 7: నమస్తే తెలంగాణ తూప్రాన్ ఆర్సీ ఇన్‌చార్జ్ కట్ట ప్రభాకర్ మాతృమూర్తి కట్ట లక్ష్మి శుక్రవారం రాత్రి గుండెపోటుతో మండలంలోని నందిగామలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, లక్ష్మి మృతదేహానికి శనివారం నివాళులర్పించి, బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు. ఆమె వెంట మాజీ జడ్పీటీసీ విజయలక్ష్మి, మాజీ ఎంపీపీ సంపత్, మాజీ సర్పంచ్ సంగుస్వామి, నాయకులు బుచ్చ నర్సింహులు, బాజ తిరుమల్, ఆకుల రాములు, బిజ్జ దాసు, కృష్ణగౌడ్, గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, రామాయంపేట విలేకరులు శర్మ, మల్లేశం, శ్రీనివాస్‌గౌడ్, సత్యనారయణ, భైరవరెడ్డి, శ్రీరామ్ తదితరులు ఉన్నారు.

ఎల్‌వోసీ అందజేసిన నర్సాపూర్ ఎమ్మెల్యే

వెల్దుర్తి, డిసెంబర్ 7: వెల్దుర్తికి చెందిన ప్రవళిక తీవ్ర అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్నది. ఆపరేషన్ కోసం రూ.2 లక్షల ఎల్‌వోసీ పత్రాన్ని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి నర్సాపూర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబసభ్యులకు శనివారం అందజేశారు.

వెల్దుర్తి: ఎల్‌వోసీని అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

చిలిపిచెడ్‌లో..

చిలిపిచెడ్,డిసెంబర్ 7: అజ్జమర్రి గ్రామానికి చెందిన బేగరి ఎల్లమ్మకు రూ.23,500, దూదేకుల ఫక్రుద్దీన్‌కు రూ.25,500ల సీఎంఆర్ఎఫ్ చెక్కులను మాజీ ఎంపీటీసీ మల్లయ్య, గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి శనివారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రాజు, పోచయ్య, రాజు, అనిల్ తదితరులున్నారు.

చిలిపిచెడ్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

వాహనం ఢీకొని జింకకు తీవ్రగాయాలు

చిన్నశంకరంపేట, డిసెంబర్ 7: గుర్తుతెలియని వాహనం ఢీకొని జింకకు తీవ్రగాయాలైన ఘటన ఎస్.కొండాపూర్ గ్రామ శివారులోని ఏడిప్పల్ వద్ద గల మెదక్ చేగుంట ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్సై నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. పెట్రోలింగ్‌కు వెళ్లిన పోలీసులు ఏడిప్పల్ వద్ద గల చేగుంట మెదక్ ప్రధాన రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని జింకకు తీవ్రగాయాలయ్యాయి విషయాన్ని గమనించిన పోలీసులు గాయపడిన జింకను పోలీస్ స్టేషన్‌కు తరలించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించి గాయపడిన జింకను అటవీశాఖ అధికారులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ జింక

వేతనాలు ఇవ్వకుండా శ్రమ దోపిడీ

మెదక్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): సమగ్ర శిక్షా ఉద్యోగులకు వేతనాలు ఇవ్వకుండా శ్రమ దోపిడీ చేస్తున్నారని ఎస్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు రాజు, కార్యదర్శి పాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజశేఖర్ వాపోయారు. కలెక్టరేట్ ఎదుట చేస్తున్న సమ్మె శనివారంతో రెండో రోజుకు చేరుకున్నది. సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసనకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, పీఆర్టీయూ మద్దతు తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట సమ్మె చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

స్టడీ టూరులో ఎంబీఏ విద్యార్థులు

టమాట పంటను పరిశీలిస్తున్న ఎంబీఏ విద్యార్థులు

కౌడిపల్లి, డిసెంబర్ 7: తునికి విజ్ఞాన జ్యోతి ఎంబీఏ విద్యార్థులు వెంకట్రావ్‌పేట, మహమ్మద్‌నగర్ గ్రామాల్లో శనివారం స్టడీ టూరుకు వచ్చి వివరాలు తెలుసుకున్నారు. తునికి రామానాయుడు విజ్ఞాన జ్యోతి యూనివర్సిటీ ఫ్యాకల్టీ డాక్టర్లు వినీత్, విశాల్, సుశీల్, హమ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో 108 మంది విద్యార్థులు గ్రామాల్లో పర్యటించారు. మహమ్మద్‌నగర్ టమాట రైతు మహిపాల్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు.

భగవద్గీత కంఠస్థ పోటీల్లో విజేతలకు బహుమతులు

బహుమతులు అందజేస్తున్న టీటీడీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ

చిలిపిచెడ్, డిసెంబర్ 7: జిల్లా స్థాయిలో భగవద్గీత కంఠస్థ పోటీలను మండలంలోని జగ్గంపేట నవ భారతి మోడల్ స్కూల్ విద్యార్థులకు నిర్వహించినట్లు టీటీడీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం నిర్వహించి పోటీలో 6,7, 8, 9వ తరగతుల తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ బహుమతికి రూ.వేయి, ద్వితీయ బహుమతి రూ.750 అందజేశారు. టీటీడీ ఉపన్యాసకుడు రాంరెడ్డి, హెచ్ఎం శ్రీకాంత్‌గౌడ్ , సత్యనారాయణ, యాదిరెడ్డి, పాముల స్వామి తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్లు, హిటాచీ పట్టివేత

వెల్దుర్తి, డిసెంబర్ 7: హల్దీ వాగు వెంబడి ఉన్న మొరం, మట్టిని తరలిస్తున్న టిప్పర్లు, హిటాచీని శనివారం పట్టుకొని పోలీసులకు అప్పగించినట్లు మాసాయిపేట తహసీల్దార్ జ్ఞానజ్యోతి తెలిపారు. బొమ్మారం గ్రామశివారు హల్దీవాగు వెంబడి మొరం మట్టిని తరలిస్తున్నారన్న సమాచారంతో దాడులు చేయగా తూప్రాన్ మండలం నాగులపల్లి వెంగళి శ్రీనుకు చెందిన రెండు టిప్పర్లు, హిటాచీతో పాటు కొప్పులపల్లి తండా మోహన్‌కు చెందిన ఒక టిప్పర్‌ను పట్టుకుని చేగుంట పోలీసులకు అప్పగించారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. బొమ్మారం, కొప్పులపల్లి గ్రామ శివారు నుంచి మట్టి దందాతో పాటు ఎర్రమట్టి దందా జరుగుతున్నదని పలువురు ఆరోపిస్తున్నారు. రెండు టిప్పర్లను ఒకే నంబర్ ప్లేట్‌తో నడుపుతుండడం గమనార్హం.

టిప్పర్లు, హిటాచీని పట్టుకున్న తహసీల్దార్, ఆర్ఐలు